www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

శనివారం
17.10.2026

నేడు తెన్నముద్దల బతుకమ్మ

ఆశ్వయుజ మాసంలో 8వ రోజున తంగేడు పూలు, గునుగు పూలు, చామంతి పూలు, గులాబీ పూలు, గడ్డి పూలు, మొదలైన పువ్వులతో బతుకమ్మను పేరుస్తారు. ఈ బతుకమ్మకు నువ్వులు, వెన్న, నెయ్యి బెల్లం కలిపి నైవేద్యంగా తయారు చేసి బతుకమ్మకు నివేదిస్తారు.





నర్సంపేట బాధ్యతలు స్వప్నకే

నర్సంపేట అంటేనే పెద్ది కుటుంబం

- కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవాలి
- నియోజకవర్గాన్ని నేనే దత్తత తీసుకుంటా
- ప్రజలను కుటుంబసభ్యుల్లా చూసుకుంటా
- కార్యకర్తలు సమన్వయంతో కష్టపడి పనిచేయాలి
- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి
- గ్రూపు రాజకీయాలకు కేటీఆర్ చెక్

2లో..



దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణంతో నర్సంపేట నియోజకవర్గ బీఆర్ఎస్ బాధ్యతలపై నెలకొన్న ఉత్కంఠకు పార్టీ అధిష్ఠానం తెరదించింది. నియోజకవర్గ పగ్గాలు ఎవరికి దక్కుతాయనే దానిపై గత కొద్ది రోజులుగా ఊహాగానాలు, గ్రూపు రాజకీయాలు జోరుగా సాగాయి. అయితే వీటన్నింటికీ ఒక్క నిర్ణయంతో చెక్ పెడుతూ పార్టీ నాయకత్వం అత్యంత కీలకమైన స్పష్టతనిచ్చింది. నర్సంపేట అంటేనే పెద్ది కుటుంబమని, నియోజకవర్గ పూర్తి బాధ్యతలను సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్నకే అప్పగిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. అంతేకాకుండా నర్సంపేటను తానే స్వయంగా దత్తత తీసుకుంటానని ఆయన ప్రకటించడం గులాబీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

కలంజ్యోతి, నర్సంపేట

హ్యుందాయ్ భారీ పెట్టుబడులు



- కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయండి
- పరిశ్రమలకు పూర్తిస్థాయి వసతులు కల్పిస్తాం
- తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో భాగస్వామ్యం కొనసాగిస్తాం
- పెండింగ్ అనుమతులను త్వరితగతిన క్లియర్ చేయండి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2 లో



కాత్యాయినిగా బాసర జ్ఞాన సరస్వతి

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
శనివారం 17.10.2026
www.kalamjyothi.com



నర్సంపేట బాధ్యతలు స్వప్నకే

నర్సంపేట అంటేనే పెద్ది కుటుంబం





కలంజ్యోతి, వరంగల్ (అక్టోబర్ 16) : నర్సంపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పూర్తి బాధ్యతలను దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్నకు అప్పగిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇటీవల పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణంతో నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు కొంత స్తంభించిపోయాయి. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు తెలంగాణ భవన్‌లో నర్సంపేట ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నర్సంపేట రాజకీయ చరిత్రలో పెద్ది కుటుంబానిది ప్రత్యేక స్థానమని కేటీఆర్ కొనియాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా పార్టీ బలోపేతానికి సుదర్శన్ రెడ్డి అహర్నిశలు శ్రమించారని గుర్తుచేశారు. ఆయన హఠాన్మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ కష్టకాలంలో పెద్ది కుటుంబానికి పార్టీ శ్రేణులు, నియోజకవర్గ ప్రజలు కొండంత అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

నియోజకవర్గాన్ని నేనే దత్తత తీసుకుంటా..

సుదర్శన్ రెడ్డి లేని లోటును తానే స్వయంగా పూడుస్తానని కార్యకర్తలకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. నర్సంపేట ప్రజలను తన సొంత కుటుంబసభ్యుల్లా చూసుకుంటానని, నియోజకవర్గాన్ని పూర్తిగా దత్తత తీసుకుని అభివృద్ధికి అన్ని విధాలా తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల సాధనకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు.

కార్యకర్తలు సమన్వయంతో కష్టపడి పనిచేయాలి..

పార్టీ నాయకులు, శ్రేణులు అంతా ఏకతాటిపై నిలబడి పనిచేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అంతర్గత విభేదాలకు తావులేకుండా సమన్వయంతో పార్టీ పటిష్టతకు పాటుపడాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలంతా పెద్ది స్వప్నకు పూర్తి సహకారం అందించాలని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై గళమెత్తి నిరంతరం ప్రజల్లోనే ఉండాలని ఆదేశించారు.

గ్రూపు రాజకీయాలకు కేటీఆర్ చెక్..

నర్సంపేట నియోజకవర్గ బాధ్యతలను కొత్త నాయకులకు అప్పగిస్తారంటూ కొద్ది రోజులుగా సాగుతున్న ప్రచారానికి కేటీఆర్ తెరదించారు. స్వప్న నాయకత్వంలోనే నియోజకవర్గంలో పార్టీ పనిచేస్తుందని కుండబద్దలు కొట్టడంతో ఆశావహుల ప్రచారాలకు, స్థానిక గ్రూపు రాజకీయాలకు పూర్తిగా చెక్ పడింది. పార్టీ అగ్రనాయకత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో స్థానిక కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.



కాత్యాయినిగా బాసర జ్ఞాన సరస్వతి

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 16) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు శుక్రవారం కాత్యాయిని మాత దివ్యాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రంతో పాటు శుక్రవారం కలిసి రావడంతో పుణ్యక్షేత్రానికి భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తారు. విశేష నక్షత్ర దినం కావడంతో చిన్నారుల అక్షరాభ్యాస పూజల కోసం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రధాన ఆలయ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో అమ్మవారు బాలాలయంలో భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ అంజనీదేవి, ఏఈఓ శ్రీనివాస్ నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల, ఖైంసా అదనపు ఎస్పీ సాయికిరణ్ బందోబస్తు చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

హ్యుందాయ్ భారీ పెట్టుబడులు



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 16) : తెలంగాణలో సరికొత్త పారిశ్రామిక విప్లవానికి బాటలు వేస్తూ ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజ సంస్థ హ్యుందాయ్ మోటార్స్ భారీ పెట్టుబడితో పరిశ్రమల విస్తరణకు ముందుకొచ్చింది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యోన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో కార్ల తయారీ యూనిట్, అంతర్జాతీయ స్థాయి ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుపై విస్తృతంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాజధాని హైదరాబాద్ కేంద్రంగా పూర్తిస్థాయి హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను నెలకొల్పాలని కంపెనీ ప్రతినిధులను సీఎం కోరారు. దేశ భౌగోళిక ముఖచిత్రంలో తెలంగాణ మధ్యభాగంలో ఉందని, అంతర్జాతీయ ప్రమాణాలు, భద్రత, జీవనానికి అత్యంత అనుకూలమైన మెట్రో నగరంగా హైదరాబాద్ నిలిచిందని వివరించారు. ఎయిర్‌పోర్టులు, రైల్వే నెట్‌వర్క్, రహదారులతో పాటు భవిష్యత్తులో పోర్టులతో హైస్పీడ్ కనెక్టివిటీ కల్పించే ప్రణాళికలు ఉన్నాయని, కార్ల ఉత్పత్తికి హైదరాబాద్ అత్యంత అనువైన ప్రాంతమని స్పష్టం చేశారు.

పూర్తిస్థాయి వసతులు కల్పిస్తాం..

హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం, మద్దతు ఉంటాయని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. తయారీ రంగాన్ని పరుగులు పెట్టించేందుకు రాష్ట్రసర్కారు కట్టుబడి ఉందన్నారు పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన వాతావరణం కల్పిస్తూ ప్రభుత్వం నుంచి అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. హ్యుందాయ్ ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్జ్) పరిధిలో సుమారు 678 ఎకరాల సువిశాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ చిత్తశుద్ధి, పారిశ్రామిక అనుకూలతలను చూసి హ్యుందాయ్ బృందం సానుకూలంగా స్పందించింది. ప్లాంట్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేస్తూ రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో సంస్థ భాగస్వామ్యాన్ని పటిష్టంగా కొనసాగిస్తుందని ఎండీ చాంగ్యోన్ చో ప్రకటించారు.

వేలాది మందికి నయా ఉపాధి అవకాశాలు..

జహీరాబాద్ నిమ్జ్‌లో రూ.8,528 కోట్ల భారీ పెట్టుబడితో సమగ్ర గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. హైటెక్ సిటీలోని ఇంజినీరింగ్ కేంద్రాన్ని విస్తరిస్తూ జహీరాబాద్‌లో భారీ వాహన పరీక్షా కేంద్రం, అత్యాధునిక టెస్టింగ్ ట్రాక్‌లు, ఇంజినీరింగ్ ప్రక్రియల మెరుగుదల వంటి వసతులను సమకూర్చనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఆటోమొబైల్ పరిశోధన, ఇంజినీరింగ్ రంగాల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు దక్కనున్నాయి. కొద్ది నెలల్లోనే ఈ ప్రాజెక్టుకు వైభవంగా శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తుండగా, ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని రకాల పెండింగ్ అనుమతులను యుద్ధప్రాతిపదికన క్లియర్ చేయాలని, ఎక్కడా జాప్యం లేకుండా వేగవంతంగా పరిశ్రమ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
శనివారం 17.10.2026
www.kalamjyothi.com

విబిజి రామ్‌జీతో లబ్ధి చేకూరాలి

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 16) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ (గ్రామీణ) (వీబీ-జీ రామ్ జీ) పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి పొందాలని కలెక్టర్ భవేష్ మిశ్రా పిలుపునిచ్చారు. జోన్ 4, 5 లకు సంబంధించి వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ (గ్రామీణ) పథకం అమలు, గ్రామీణ స్థాయి సూక్ష్మ ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం శుక్రవారం భైంసాలో నిర్వహించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా, ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ కలిసి ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల వ్యవసాయం తీవ్రంగా దెబ్బతిన్నదని, పంటల దిగుబడి తగ్గి వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గే పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామీణ ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా, నీటి సంరక్షణ పద్ధతులను బలోపేతం చేసేందుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందని వివరించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ 125 రోజుల పని దినాలు సద్వినియోగం చేసుకోవాలని, దీని ద్వారా పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని స్పష్టం చేశారు.

నీటి సంరక్షణతోనే భవిష్యత్తుకు భరోసా

ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు, లోటు వర్షపాతం కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, జలాశయాల్లో నీటి లభ్యత గణనీయంగా తగ్గిందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. నీటి సంరక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టడం ద్వారా భూగర్భ జలాల పునరుద్ధరణ సాధ్యమవుతుందని, భవిష్యత్తు అవసరాలకు నీటి వనరులను కాపాడినట్లవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ సుధాకర్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ తుకారాం, తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీఓ పుష్పలత, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

ఆర్డీఓ శ్రీధర్ బాబు

సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 16) : ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీసర్వే పనులను పారదర్శకంగా పూర్తి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతలు నిర్వర్తించాలని ఆర్డీఓ శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం సర్వేపల్లిలో జరుగుతున్న రీసర్వే పనుల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించిన సందర్భంగా పలువురు అధికారుల పనితీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పనులు పూర్తి చేయాలని, ప్రజలకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశిస్తూ బాధ్యతల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆగ్రహం వ్యక్తం చేశారు.



పర్యవేక్షణను కార్యాలయాలకే పరిమితం చేయొద్దు..

ప్రభుత్వం చేపట్టిన భూ సంబంధిత కార్యక్రమాల ప్రయోజనాలు ప్రజలకు నేరుగా చేకూరాలంటే క్షేత్రస్థాయి పరిశీలన ఎంతో కీలకమని ఆయన అధికారులకు తేల్చి చెప్పారు. రీసర్వే పనులను కేవలం కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దివ్యజ్యోతి, డీటీ వేణు, సాహితి పాల్గొన్నారు.



'జన నాయకుడు'

పుస్తకావిష్కరణ

తెలంగాణ ఉద్యమంలో పెద్ది పాత్ర కీలకం

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 17) : నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన 'జన నాయకుడు' పుస్తకాన్ని హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఘనంగా ఆవిష్కరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి, పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్నకు బహూకరించారు. యువ సాహిత్య రత్న, ప్రముఖ సామాజిక రచయిత కడియాల సురేష్ కుమార్ రచించిన ఈ గ్రంథంలో సుదర్శన్ రెడ్డి బాల్యం, విద్యాభ్యాసం, 2001లో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన క్రియాశీలక పాత్ర, నల్లబెల్లి జడ్పీటీసీగా, వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, పౌర సరఫరాల సంస్థ చైర్మన్‌గా, 20182023 నర్సంపేట ఎమ్మెల్యేగా అందించిన విశేష సేవలు, ప్రజా సమస్యలపై చేసిన పోరాటాలను సమగ్రంగా పొందుపరిచారు.

అంకితభావంతో పనిచేసిన నేత..

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడని, పార్టీ అభ్యున్నతికి నిరంతరం అంకితభావంతో సేవలందించిన నిబద్ధత గల నాయకుడని కొనియాడారు. ఆయన అకాల మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నల్లబెల్లి మండల నాయకులు, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, సర్పంచ్ మూర్తి, మనోహర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథ రచయిత కడియాల సురేష్ కుమార్‌ను నాయకులంతా ఘనంగా అభినందించారు.

అక్రమ మద్యంపై ఎక్సైజ్ ఉక్కుపాదం

చట్టవిరుద్ధంగా విక్రయిస్తే కఠిన చర్యలు

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 16) : గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టడమే లక్ష్యంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి, బొప్పాపూర్, గుండారం, తిమ్మాపూర్, పోతిరెడ్డిపల్లి, హరిదాసునగర్, అగ్రహారం గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న ఐఎంఎఫ్ఎల్ మద్యం విక్రయ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా గొల్లపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రెండు కేసులను గుర్తించి, ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి 180 ఎంఎల్ పరిమాణం గల మొత్తం 38 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ విజయేందర్ అధ్యర్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.



పీఆర్టీయూ అధ్యక్షుడిగా ఆకుల నరేందర్

సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తా



కలంజ్యోతి, హన్మకొండ (అక్టోబర్ 17) : తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం (పీఆర్టీయూ టీఎస్) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఆకుల నరేందర్ పటేల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి గురుతర బాధ్యతను అప్పగించినందుకు ఉపాధ్యాయుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం సాగిస్తానని, సామాజిక న్యాయం కోసం చిత్తశుద్ధితో సేవ చేస్తానని స్పష్టం చేశారు. తన ఎన్నికకు సహకరించిన పీఆర్టీయూ మండల అధ్యక్షులందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
శనివారం 17.10.2026
4
www.kalamjyothi.com



గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజా పాలనలో మౌలిక వసతులకు పెద్దపీట

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 16) : గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రజా పాలనలో పనులను శరవేగంగా చేపడుతున్నామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని పదహారు చింతలలో రూ.6.50 లక్షల వాటర్ ప్లాంట్, ఖాదర్‌పేటలో రూ.10 లక్షల మహిళా సమాఖ్య భవనం, గొల్లపల్లిలో బతుకమ్మ విగ్రహం, జోజిపేటనారాయణతండాలో రూ.15 లక్షల సీసీ రోడ్డుతో పాటు మరో వాటర్ ప్లాంట్ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మహిళా సాధికారత, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పీసీసీ సభ్యులు, కాంగ్రెస్ నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, సొసైటీ, మార్కెట్ డైరెక్టర్లు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



కనకదుర్గమ్మ సన్నిధిలో కుంకుమ పూజలు

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 16) : దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా నర్సక్కపేట గ్రామంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో సర్పంచ్ బెంద్రం శంకరమ్మతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేపట్టడం సంతోషంగా ఉందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బెంద్రం తిరుపతిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

జనగణనపై అధికారులకు శిక్షణ

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 16) : భారత జనాభా గణన 2027 నిర్వహణకు సంబంధించి జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ, తహసీల్దార్ కార్యాలయాల్లోని ఛార్జ్ క్లర్క్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లకు గురువారం రెండవ దశ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జనగణన ప్రక్రియలోని వివిధ అంశాలపై సిబ్బందికి సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో చేపట్టే విధుల్లో పూర్తి అవగాహనతో వ్యవహరిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి గంగారెడ్డి, తెలంగాణ డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ ప్రతినిధి డి.వి. రమణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





క్షయ నిర్మూలనకు ఎక్స్ రే పరీక్షలు

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 16) : గ్రామీణ ప్రాంతాల్లో క్షయ వ్యాధి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తిమ్మాపూర్ గ్రామంలో హైరిస్క్ ప్రజలకు ప్రత్యేకంగా ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఏంజెలీనా ఆల్ఫ్రెడ్ ఆదేశాల మేరకు డాక్టర్ సారియా అంజుమ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం కొనసాగింది. గ్రామంలోని హైరిస్క్ విభాగంలో ఉన్న 81 మందికి వైద్య సిబ్బంది ఎక్స్‌రే పరీక్షలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ అందే సుభాష్, ఉపసర్పంచ్ దేవేందర్, సేవాలాల్ తండా సర్పంచ్ రజిత, హెచ్ ఈవో రాజేందర్, టీబీ సూపర్వైజర్లు మహిపాల్, జేత్య, హెచ్ఎస్ పద్మ, డిస్ట్రిక్ట్ లీడ్ సూపర్వైజర్ జె. నాగరాజు, ఎక్స్‌రే టెక్నీషియన్ బాలు, ఏఎన్ఎంలు వి. సువర్ణ, సుమలత, అమృతవల్లి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా వెంకట మాధవరావు



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 16) : నిర్మల్ జిల్లా నూతన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా డి. వెంకట మాధవ రావు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాకు పూల మొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని చెప్పారు. అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించినందున పలువురు కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



ఏఎంసీ డైరెక్టర్‌కు ఘన సన్మానం

లక్ష్మణ్ సేవలను విస్తరించాలి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 16) : వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గంలో బాధ్యతలు చేపట్టిన రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఏఎంసీ డైరెక్టర్ మిట్టపల్లి లక్ష్మణ్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బంగారు బాల్‌రెడ్డి శుక్రవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ రైతు సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గంట కార్తీక్ గౌడ్ పాల్గొని లక్ష్మణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
శనివారం 17.10.2026
www.kalamjyothi.com



కాంగ్రెస్‌కు పట్టభద్రులు బుద్ధి చెబుతారు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మోసపూరిత పాలనపై నిరుద్యోగుల ఆగ్రహం
- విద్యారంగాన్ని సర్కారు సంక్షోభంలోకి నెట్టింది
- బాధ్యతగా గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కావాలి

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 16) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై విద్యావంతులు, నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో ఎన్నికల సన్నద్ధతపై విస్తృత సమీక్ష నిర్వహించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అధికారంలోకి రాకముందు నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కి నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పూర్తిగా అడుగంటాయని, కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయకుండా యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. సర్కారు వైఫల్యాలపై రగిలిపోతున్న యువత రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

విద్యారంగాన్ని సర్కారు సంక్షోభంలోకి నెట్టింది..

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ప్రభుత్వం తీవ్ర సంక్షోభంలోకి నెట్టేసిందని కేటీఆర్ విమర్శించారు. విద్యాసంస్థల సమస్యలను గాలికొదిలేసి విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ దగాకోరు తీరుకు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బ్యాలెట్ బాక్స్ సాక్షిగా తగిన సమాధానం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల వ్యూహంలో భాగంగా గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియను శ్రేణులు అత్యంత బాధ్యతతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్‌ను గుర్తించి, వారి పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేయించేందుకు ప్రతి ఒక్కరూ చురుగ్గా కదలాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగరేసేందుకు విభేదాలు వీడి సమష్టిగా పనిచేయాలని, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ పార్టీ అభ్యర్థి విజయానికి ఐకమత్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు.



ఎకరాకు రూ.50 వేలు పరిహారమివ్వాలి

- రైతాంగానికి 24 గంటల విద్యుత్ అందించాలి
- టీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ బోడ అనిల్‌కుమార్‌నాయక్

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 16) : నర్సంపేట మండలం గురిజాల గ్రామ పరిధిలో ఎండిపోయిన వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించిన టీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ బోడ అనిల్ కుమార్ నాయక్, పంట నష్టపోయిన అన్నదాతలకు ఎకరాకు రూ.50 వేల పరిహారాన్ని తక్షణమే ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి, ప్రస్తుతం కనీసం ఆరు గంటలు కూడా సరఫరా చేయకపోవడం వల్లే పంటలు నిలువునా ఎండిపోతున్నాయని విమర్శించారు. వర్షభావ పరిస్థితులపై ముందస్తు చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పందించి నిరంతర విద్యుత్ అందించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి సబ్‌స్టేషన్ల ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఆరుతడి పంటలను ప్రోత్సహించండి

కలెక్టర్ భవేశ్ మిశ్రా

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 16) : ప్రస్తుతం ఉన్న ఎల్ నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తక్కువ తడులతో సులభంగా సాగయ్యే పంటలను వేసేలా రైతులను అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. అధికారులతో వ్యవసాయ సంబంధిత అంశాలపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులంతా క్షేత్ర స్థాయిలో ఉంటూ రైతులకు సహకారం అందించాలన్నారు. డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుజాత, ఉద్యానవన పంటల అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

మండల కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 16) : తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను చెన్నారావుపేట మండల కార్యాలయ ప్రాంగణంలో మహిళా ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ, తహసీల్దార్, వ్యవసాయ శాఖ ఏఓల ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో సెర్ప్, ఐసీడీఎస్, వీబీజీరామ్‌జీ, వైద్య ఆరోగ్య శాఖలకు చెందిన మహిళా సిబ్బంది, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను కొలువు దీర్చి, సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలంతా చప్పట్లు కొడుతూ లయబద్ధంగా ఆడిపాడారు. పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉత్సాహంగా గడపడంతో మండల కార్యాలయం పండుగ శోభతో కళకళలాడింది.



కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

మనసుకు నచ్చిందే చేస్తా

సినిమాల్లో ప్రేక్షకుల అంచనాల కోసం కాకుండా తన మనసుకు నచ్చిన పనులే చేస్తానని నటి అనీత్ పడ్డా స్పష్టం చేసింది. 'సైయారా' విజయం తర్వాత మ్యాడాక్ హారర్ కామెడీ యూనివర్స్ చిత్రం 'శక్తి షాలిని'లో నటిస్తున్న ఆమె, మొదటి సినిమా విజయ భారంతో ఒత్తిడికి గురికాకుండా కేవలం నటనపైనే దృష్టి పెట్టానని తెలిపింది. మార్కెట్ లెక్కింపుల కంటే సృజనాత్మక సంతృప్తినిచ్చే వైవిధ్యమైన పాత్రలకే ప్రాధాన్యం ఇస్తానంది. యాక్షన్, రొమాన్స్, హారర్ అంశాలతో కూడిన 'శక్తి షాలిని' చిత్రంలో కెరీర్ ప్రారంభంలోనే పూర్తి స్థాయి సోలో పాత్ర దక్కడం అదృష్టమని, ఈ సినిమా ఫలితానికి తానే పూర్తి బాధ్యత వహిస్తానని పేర్కొంది.



Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.